మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఆపదలో ప్రజలకు సీఎం సహాయనిధి అండగా నిలిచింది

● గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల ప్రతినిధి,జులై 22 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల టౌన్ వివిధ వార్డులకు సంబంధించిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గద్వాలఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందించారు.సలీంపాషాకు చికిత్స నిమిత్తం రూ.36 వేలు, కర్రెన్నకు రూ. 28 వేలు, జరీనా సుభాన్‌కు రూ. 28 వేలు, తరుణ్‌కు రూ. 20 వేలు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరమైన పేద ప్రజలు వైద్యంకోసం ఖర్చు పెట్టిన డబ్బులను సీఎం సహాయనిధి ద్వారా 50 శాతం డబ్బుల రూపంలో లబ్దిదారులకు అందజేయడం జరుగుతుంది. కరోనా కష్ట సమయంలో కూడా పేద ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కెసిఆర్ అని పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి బాలేక ఆసుపత్రిలో ఖర్చు పెట్టిన వాటికి సంబంధించిన బిల్లులను సీఎం సహాయనిధి పంపితే సీఎం సహాయం కింద నమోదు చేసుకున్న వారికి లబ్దిదారుకు సీఎం సహాయనిధి ద్వారా చెక్కుల అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, కౌన్సిలర్ మురళి, నరహరిగౌడ్, శ్రీను, కృష్ణ గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, బిఆర్ఎస్ పార్టీ నాయకఉలు షుకర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

# నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోవద్దు

- క్షేత్ర స్థాయిలో దృష్టి పెట్టాలి: వీసీలో డీజీపీ అంజనీకుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త:** నేరాలను ప్రవృత్తిగా మార్చుకుని నేరాలకు పాల్పడే నిందితులను చట్టం నుంచి తప్పించుకోకుండా పోలీస్ అధికారులను క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. ఆర్థిక సంవత్సర నేర సమీక్షలో భాగంగా శనివారం డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నిరూపణలో సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటూ అవసరమైన భౌతిక సాక్ష్యాలను , ఆధారాలను సేకరించడం కోర్టు మానిటరింగ్ సిస్టం ద్వారా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను సమన్వయం చేసుకుంటూ సాక్ష్యాలను సకాలంలో న్యాయస్థానంలో ప్రవేశపెట్టి నేరస్థుడికి శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఏకీకృత సేవలను విస్తరింపజేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది మరణిస్తున్నారని, ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుదారులకు న్యాయం జరుగుతుందని భరోసా కల్పించే విధంగా ప్రతి ఒక్క అధికారి వ్యవహిరించాలని సూచించారు. మీ యొక్క పరిధిలో సైబర్ నేరాలు గగ్గించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అధికారులందరూ సిబ్బంది వెల్ఫేర్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. వీసీ ఎస్పీ నరసింహ హాజరయ్యారు.



వీసీ హాజరైన ఎస్పీ నరసింహ, అధికారులు

# ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

- రవాణా, అనారోగ్య సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి,జూలై22,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోగత మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుసునతన్న వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ,ఆస్థి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాల వల్ల రహదారులపై అడ్డంగా నీరు పారే ప్రాంతాలను గుర్తించి ప్రమాద తీవ్రతను బట్టి ప్రజలు రహదారి దాటకుండా బారి కేడ్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా వర్షాలకు కొత్త నీరు ప్రవహించే వాగులు పంపులు, కాలువలు లేదా ప్రాజెక్టుల వంటి ప్రదేశాలలో చేపలు పట్టే జాలర్లు, యువకులు సాహసాలు చేస్తారని, విద్యార్థులు ఆయా ప్రాంతాలను చూడడానికి వస్తుంటారన్నారు. అలాంటప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్థానిక అధికారులు పంచాయతీ కార్యదర్శులు అప్ర మత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు పడుతున్న సమయంలోనే కాకుండా ఆ తరువాత కాలంలో వర్షాలకు తడిసిన పాత మిద్దెలు కూలిపోయే అవకాశం ఉందని వాటిని గుర్తించి అలాంటి కుటుంబాలను శిబిరాలకు, ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రేవల్లి మండలం తల్పునూరు గ్రామంలో పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉందని వెంటనే పంచాయతీ రాజ్ అధికారులు సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో చెత్త ప్లాస్టిక్‌తో పేరుకుపోయి ఉన్న డ్రైనేజీల వల్ల ఎక్కువగా ఇబ్బందులు వస్తాయని వీటిలో నీరు నిలువకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అందుకు తగ్గ మిషనరీని అందుబాటులో ఉంచుకోవాలని జిల్లాలోని మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. అలాగే మరమ్మతులు చేస్తున్న రహదారుల వద్ద కానీ వివిధ భవనాల వద్ద కానీ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి సూచనల బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో టీంలు ఏర్పాటు చేసుకుని రాత్రి సమయాల్లో సైతం చురుకుగా ఉండాలని అన్నారు. వర్షాల కారణంగా తాగు నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున నీటి పరీక్ష లు నిర్వహించేందుకు మిషన్ భగీరథ అధికారులు కావలసిన పరికరాలను సమకూర్చుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం తీసుకుని మంచినీరు సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు సైతం కావలసిన జాగ్రత్త లపై అవగాహన కలిగించాలని తెలియజేశారు. సెలవు రోజైనా ఆదివారం సైతం అధికారులు అప్ర మత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ తిరుపతి రావు, జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి, జడ్పీ సీఈవో శ్రావణ్ కుమార్, ఆర్డీవో పద్మావతి, ఇరిగేషన్ పంచాయతీ రాజ్ ఈఈ , ఆర్అండ్‌బి ఈఈ జిల్లాలోని తహసీల్దార్లు , ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హుండీ చోరీ


ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన దొంగతనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

**అమరచింత,జూలై22,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కృష్ణంపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు భక్తులు సమర్పించిన రెండు లక్షల రూపాయలు, వెండి ఆభరణాలు దొంగతనం చేశారని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. శనివారం కృష్ణంపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన దొంగతనాన్ని పరిశీలించి,దొంగతనం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# అంకితభావంతో పని చేయండి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగి రెడ్డి నిరంజన్‌రెడ్డి


నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి విద్యా విభాగం,జూలై22,ప్రభాతవార్త:** అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలనునిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖలో ఎంపికై (ఎల్ఎస్ఈఆర్పీ) 18 మంది సమ్మిళిత విద్యా సమన్వయ కర్తలకు, డాటాఎంట్రీ ఆపరేటర్లకు, (ఎంఐఎస్) మండల మేనేజ్‌మెంట్ ఇన్ఫర్‌మేషన్ కంప్యూటర్ ఆపరేటర్లకు నియామకపత్రాలను అందజేశారు.

# ధరణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త:** ధరణి దరఖాస్తుల విషయంలో తాసిల్దార్లు, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే జీఎల్ఎం, మ్యూటేషన్ వంటివి పరిష్కరించాలని కలెక్టర్ జి రవినాయక్ ఆదేశించారు. ప్రతి వారం నిర్వహించే రెవెన్యూ సమీక్షలో భాగంగా శనివారం రెవెన్యూ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం భవన సముదాయంలో వీసీ హాల్ నుంచి తాసిల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కరించాలని, పాత దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మీ సేవ ద్వారా ధ్రువపత్రాల జారీ సంబంధించి ప్రత్యేకంగా మరణ ధ్రువపత్రాలు జారీ చేసేటప్పుడు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు.ఎన్నికలకు సంబంధించి ఫారం 6,7కు సంబంధించి అన్ని దరఖాస్తులను ఈ నెల 27లోగా ఎట్టి పరిసితుల్లో పరిష్కరించాలని, ఇందుకుగానూకలెక్టర్ కార్యాలయంలో ఒక కంప్యూటర్ ల్యాబ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ ఇండ్ల పట్టాలను సైతం పూర్తి చేయాలని,విద్యుత్ సబ్ స్టేషన్లకు భూమి కేటాయింపునకు ప్రాధాన్యత ఇవ్వాలని, 58,59 జీవో కింద దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ మోహన్‌రావు, ఆర్డీవో అనిల్‌కుమార్, డీఆర్‌డీవో యాదయ్య, హౌసింగ్ ఈఈ వైద్యం భాస్కర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు , కలెక్టరేట్ ఏవో శంకర్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

# పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను మరింత మంది ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని చాంబర్‌లోని జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనపై ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీఎస్ ఐపాస్ చట్టం క్రింద వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి అనుమతి మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. టీప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ధరఖాస్తులను వాహనాలకు సంబంధించి సబ్సిడీ మంజూరుకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు కావాల్సిన రూ.70లక్షల నిధులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు మరింత మంది ముందుకు వచ్చేలా ప్రోత్సాహించాలన్నారు. పరిశ్రమల కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత కాలంలో అనుమతులు జారీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ శాఖ అధికారి రవికిరణ్, డీటీసీపీ శేఖర్, జిల్లా భూగర్భజల అధికారిణి రమాదేవి, ఆర్డీఓ ఎర్రి స్వామి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌషల్ కిశోర్‌పాండే తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలి: జిల్లా కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** పొగాకు రహిత జిల్లాయే లక్ష్యంగా ఆయా శాఖల అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, కార్మిక, విద్య, తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగించకుండా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, కార్మిక, మున్సిపల్ శాఖల అధికారులు పొగాకు సంబంధిత మత్తు పదార్థాల అమ్మకాలు నియంత్రించడంలో కీలక పాత్ర వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, జన సామర్థ్యం ఉండే అన్ని ప్రాంతాల్లో పొగాకు ఏరూపంలో ఉపయోగించినా నేరమని, రూ.200/-జరిమానా విధించబడుతుందని తెలియజేసే ఫ్లెక్సీలను, పెయింటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ శాఖ ద్వారా తనిఖీలు నిర్వహించి విక్రయాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారికి రూ.200ల చొప్పున 80 వేల రూ॥ల వరకు జరిమానా విధించడం జరిగిందని ఆయన తెలిపారు.18 సంవత్సరాల లోపు పిల్లలకు పొగాకు అమ్మిన, వారితో అమ్మించిన చట్టరీత్య నేరమని, విద్యా సంస్థల పరిసరాలకు 100 మీటర్ల దూరంలో పొగాకు సంబంధించిన దుకాణాల ఉండరాదన్నారు.సెక్షన్ 4 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగడం నేరమని, సెక్షన్ 5 ప్రకారం పొగాకు సంబంధించిన ప్రకటనలు చేయడం కూడా నేరమని స్పష్టం చేశారు. ఆరోగ్య హెచ్చరికలకు సంబంధించిన చిత్రపటాలుతప్ప నిసరిగా ఉంచాలని సూచించారు. ఆయా అధికారులు సమన్వయం తో పనిచేసి జిల్లాను పొగాకు రహితంగా మార్చాలని కోరారు. పొగా కు అలవాటు మానడానికి 1800112356ౙ011, 22901701 లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమం లో జిల్లా ఎస్పీకె.మనోహర్, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, డీఈఓ గోవింద రాజులు, డీఎస్పీలు తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ కబంధ హస్తాల్లో దళితుల భూములా..?

-భూ కబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు
-నిషేధిత జాబితాల్లోని భూములు నాయకుల పేరిట మార్పు
-డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, జులై 22 ప్రభాతవార్త:** మారుమూల ప్రాంతాల్లో జీవిస్తున్న దళితుల భూములను బీఆర్ఎస్ నాయకులు తమ కబంధ హస్తాల్లోకి మార్చుకునేందుకు అధికారులతో కుమ్మక్కై భూదాన్ భూములు, నిషేధిత జాబితాల్లో ఉన్న భూములను వారి పేరిట చేయించుకొని దళిత ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ బీఆర్ఎస్ నాయకులపై నిప్పులు చెరిగారు. అచ్చంపేట మండలం చెన్నారం రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 27/ఆ, 27/ఆ2 లలోని నిసేధిత జాబితాల్లోని భూములను బీఆర్ఎస్ నాయకులు తమ పేరిట ధరణిలో మార్చుకోవడం సిగ్గుచేటుకరమని ఆయన దుయ్యబట్టారు. శనివారం అచ్చంపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు దౌర్జన్యంగా తమ పేరిట మార్చుకున్న భూములపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం దళితులకు 3ఎకరాల భూమిని పంపిణీ చేసి దళితుల అభ్యున్నతి కోసం పాటు పడుతామన్న మాటలు ఏమాయ్యాయని, అధినాయకుడు వాగ్దానాన్ని నేరవేర్చకపోగా క్రింది స్థాయి నాయకులు మాత్రందళితుల భూములను కబ్జాచేసి తమ ఆస్తులను పెంచుకోవడం బీఆర్ఎస్ నాయకులకు సబబు కాదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు దొంగ హామీలను గుప్పించి ప్రజలను మాయ మాటలు సూచించి మోసం చేసి గద్దెనెక్కి అభివృద్ధి పర్చాల్సిన ప్రజా ప్రతి నిధులు, నాయకులే కబ్జాలకు పాల్పడుతూ అమాయకమైన ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్దంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పిదాలే బీఆర్ఎస్ పార్టీని గద్దె దించేందుకు మూలస్తంభాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో ఉద్యమ నాయకులు, కాంగ్రెస పార్టీ నేత రాజేందర ,కౌన్సిలర్ గౌరిశంకర్,మండల అధ్యక్షులు నరసయ్య యాదవ్,నాయకులు రామనాథం,కాశన్నయాదవ్,హరినారాయణగౌడ్, రాజగోపాల్,ముత్యాలు,యువజన కాంగ్రెస్ నాయకులుఅజయ్, గౌస్, మహేష్, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, ఇందిరమ్మ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చిక్కుడు వంశీకృష్ణ

## బిఎల్ఓలు ఇంటింటి సర్వేలో 18 ఏళ్లు పైబడిన

# ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ఉట్కూర్,జులై 22 ప్రభాతవార్త :** శనివారం ఉట్కూర్‌లో బూత్‌స్థాయి అధికారుల శిక్షణ సమావేశం ఏర్పాటు చేసి బూత్ లెవల్ అధికారులకు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఇంటిలో 18 ఏళ్ల నుండి 20 లోపు గలవారిని ఫారం 6 ద్వారా నమోదు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఫారం 6,7,8 ద్వారా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వాటిలో ఎన్ని పెండింగ్‌లు ఉన్నాయి తదితర విషయాలను కంప్యూటర్ ద్వారా పరిశీలించి తెలుసుకున్నారు. ఈఆర్ఓ లాగిన్ ద్వారా ఓటర్ల జాబితా మార్పులు చేర్పులు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటగది మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్ పరిశీలించి హాస్టల్ నిర్వహణకులకుసూచనలు చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ తిరుపతయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటాలి, నాటిన మొక్కలను సంరక్షించుకోవాలి

● గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి


మొక్క నాటుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,జులై 22 ప్రభాతవార్త:** పర్యావరణం బాగుంటేనే ఊరూ బాగుంటుందని, ప్రజలు బాగుంటారని ఎక్కడ ఖాళీ స్థలం అక్కడ మొదలు నాటాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఉదయం జిల్లా ఐడిఓసి కార్యాలయ ఆవరణలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీ స్థలం ఎక్కడ ఉన్న అక్కడ ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటితే పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి కాపాడాలని అన్నారు. గ్రీన్ ఎర్త్ క్యాంపెయిన్‌లో భాగంగా యూనియన్‌బ్యాంక్ ఆధ్వర్యంలో 500ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారని కలెక్టర్ తెలిపారు.మొక్కలునాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ఈసందర్భంగా జిల్లా అధికారులందరితో కలిసి 500 మొక్కలు నాటారు. పాదులు తీసి మట్టినింపి మొక్కలు నాటాలని, వర్షానికి మొక్కలు పడిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఆర్.సత్య నారాయణ, ఎల్డీఎంఅయ్యప్పరెడ్డి,యూనియన్ బ్యాంక్ మేనేజర్లు రమాశృతి, హాజీ యాదవ్, అసిస్టెంట్ డిఆర్‌డిఓ సరోజమ్మ, పశు సంవదర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఇడిఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, డిపిఆర్ఓ చెన్నమ్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

● నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

**కోయిల్‌కొండ,జులై 22 ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. శని వారం మండల పరిధిలో గల శేరి వెంకటాపూర్ గ్రామంలో గల రైతు వేదిక దగ్గర కాంగ్రెస్ అనుచిత మాటలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలోఅమలవుతున్న పథకాలు దేశంలో మరెక్కడాలేవన్నారు. రైతు సంక్షేమం కోసం రైతుబంధు, రైతుభీమా ఇలా ఎన్నో పథకాలను ప్రవే శపెట్టి రైతులను ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు ఎస్.రవిందర్‌రెడ్డి, జడ్పీటిసి విజయ భాస్కర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్ బి.కృష్ణ, మండల సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు భీంరెడ్డి, మండల రైతు సమన్వయర్త మల్లయ్య యాదవ్,జిల్లా రైతు కమిటి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మోదీపూర్ సర్పంచ్ బి.రవి శేరివెంకటాపూర్ సర్పంచ్ సుందరమ్మ మోహన్‌రెడ్డి, ఎంపిటిసి ప్రతాప్‌రెడ్డి, గ్రామ టిఆర్ఎస్ నేతలు సాయిరెడ్డి, బాలకృష్ణయ్య,సర్పంచ్‌లు కల్పనా బచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**అలంపూర్,జులై 22 ప్రభాతవార్త:** మానవపాడు మండల సమీపంలో ఎస్సై రాము, తన సిబ్బంది ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపించిన ప్రోత్సహించిన చట్టరిత్యా నేరమని బాల్య వివాహాలు జరిపిస్తే అనర్థాలను గురించి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకూడదని 18 సంవత్సరాల వయసు వచ్చేంత వరకు అమ్మాయిలకు వివాహం చేయకూడదని తెలిపారు. బాల్య వివాహాలు జరిపిస్తే జరిగే నష్టాలను గురించి వివరించారు. అనంతరం 18 సంవత్సరాలలోపు తప్పిపోయిన, వదిలివేయబడిన, కార్మికులుగా ఉన్న బాల బాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం సేకరించి, రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని, బలవంతంగా బిక్షాటన చేయించిన వారిపై వెట్టి చాకిరి చేయించిన వారిపై తగిన క్రిమనల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, పోలీస్ కానిస్టేబుల్‌లు రమణ, గిరి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర రైల్వేగేటును యథావిధిగా తెరచిఉంచాలి

**-రైల్వేశాఖ సహాయమంత్రిని కలిసిన దేవరకద్ర బాలన్న**



సహాయమంత్రికి కురుమూర్తిస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న దేవరకద్ర బాలన్న

**దేవరకద్ర, జులై 22 ప్రభాతవార్త:** దేవరకద్రలో మూసివేసిన రైల్వేగేటును యదావిధిగా తెరచిఉంచాలని రైల్వేశాఖ సహాయమంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వేను బిజేపి రాష్ట్ర నాయకుడు దేవరకద్ర బాలన్న విజ్ఞప్తి చేశారు. డిల్లీలో శనివారం రైల్వేశాఖ సహాయమంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వే నివాసంలో కలసి ఆయనకు ఈ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానించారు. అలాగే తెలంగాణ పవిత్ర తిరుపతి పుణ్యక్షేంత్రం కురుమూర్తిస్వామి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. అలాగే అక్కడి ప్రసాదాన్ని కూడ అందజేశారు. అనంతరం రైల్వేగేటును మూసి వేయడం వల్ల పట్టణ ప్రజలు, వ్యాపారస్థులకు తలెత్తిన ఇబ్బందులను దేవరకద్ర బాలన్న ఆయనకు వివరించారు. దీని వల్ల దాదాపు కొన్ని వందల కుటుంబాలు రోడ్డునపడ్డాయని ఆయనకు తెలిపారు. కావున దేవరకద్రలో మూసివేసిన రైల్వేగేటును యదావిధిగా తెరచిఉంచేలా తగు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. దీని వల్ల దాదాపు 30గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తడమే గాకుండా జిల్లాలోని ప్రసిద్ధి అయిన దేవరకద్ర పశువుల సంత పూర్వవైభం కోల్పోయే ప్రమాద ముందని దేవరకద్ర బాలన్న మంత్రి ముందు ఆవేదన వ్యక్తపరిచారు. దీనికి మంత్రి స్పందిస్తూసాధ్యమైనంతవరకు సమస్య పరిష్కరించదానికి కృషిచేస్తానని హామి ఇచ్చినట్లు బిజేపి నాయకులు తెలిపారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన మైనార్టీ నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

**గద్వాల ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని కెటిదొడ్డి మండల పరిధిలోని సోంపురం, చింతలకుంట గ్రామాలకు చెందిన మైనార్టీ నాయకులు ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా నిర్మాణం ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ చేసి ప్రతి గ్రామానికి చొప్పున 30 లక్షలతో నిర్మాణం చేయదానికి కేటాయించినందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాకేత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కెసిఆర్‌కు, మంత్రి హరీష్‌రావు, కెటిఆర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి బిఆర్‌ఎస్ పార్టీకి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని మైనార్టీ నాయకుల తరపున తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, జడ్పీటిసి రాజశేఖర్, గట్టు మండలం పిఎసిఎస్ ఛైర్మన్ వెంకటేష్, సర్పంచ్‌లు తిక్కన్న, సత్యనారాయణ, ఎంపిటిసి గోవిందు, సింగిల్‌విండో డైరెక్టర్ రఘు కుమార్‌శెట్టి, మండల కో ఆప్షన్ మెంబర్, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు చక్రం రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఖలీల్, ఖాజాతిమ్మరాజు, మైనార్టీనాయకులు పాల్గొన్నారు.

## జడ్పీ ఛైర్‌పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నందు



జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**గద్వాల ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ఢిల్లీ పర్యటన ముగించుకుని గద్వాలకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నందు, మాజీ అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అలాగే కోడూరు ఎర్రవల్లి గ్రామానికి చెందిన విజయ్, కృష్ణ, శేఖర్, వెంకటేశ్వర్లు సీనియర్ నాయకుడు పాతపాలెం శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

**- అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో దీక్ష**



సాయిచంద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అమరచింతలో దీక్ష చేస్తున్న దృశ్యం

**అమరచింత, జూలై22, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ గాయకుడు అమరుడు సాయిచంద్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా కార్యదర్శి అమరచింత విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వరనయంలో పాత బస్టాండ్‌లో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాట ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యపరిచి తెలంగాణ రాష్ట్ర సాధనలో సాయిచంద్ ప్రధానపాత్ర పోషించారని ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర మార్కెట్ గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించారని ఆయన అకాల మరణం బాధాకరమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాయిచంద్ ఆశయ సాధనకై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సాయిచంద్ మరణం కళాకారులకు, టీఆర్‌ఎస్ పార్టీకి కుటుంబానికి మిత్రులకు తీరని లోటు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ రాజశేఖర్, రామ్మూర్తి, రాజేందర్, రాములు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వేసే విధానంపై అవగాహన తప్పనిసరి

**కల్వకుర్తి, జూలై22 ప్రభాతవార్త:** ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేయదంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రాంరెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలంలోని యంగంపల్లి, జిల్లెల్ల గ్రామాల్లో ఓటు వేసే విధానంపై రెవెన్యూ అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఓటే వేసే విధానంపై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు ఎంత మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు, వారి వివరాలతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో ప్రతి రోజు సాయంత్రం పోలైన ఓట్ల వివరాలను తెలుపాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

# గ్రామాలకు రోడ్లు కూడా వేయలేని పాలన మీకెందుకు..?

**నెట్టెంపాడు నుండి నీలహాళ్లి వయా పాతపాలెం వరకు అడుగడుగునా గుంతలే!**
**పట్టించుకోని పాలకులు, అధికారులు**
**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్**



రోడ్డుపై గుంతలను పరిశీలిస్తున్న గొంగళ్ల రంజిత్‌కుమార్

**గద్వాల ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** ఏదైనా ఆపద వస్తే ఆ దారిన ప్రయాణీకులు వెళ్తే ఇక నరకయాతన అనుభవించాల్సిందే. ధరూర్ మండలంలోని నెట్టెంపాడు గ్రామం నుంచి నీలహళ్లి మార్గ మధ్యలో 5 కి.మీ. వరకు ఉన్న రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. నెట్టెంపాడు గ్రామం నుంచి అటుగా వెళ్లే ప్రయాణీకులు నీలహళ్లి గ్రామానికి వెళ్లలన్నా నరకయాతన అనుభవిస్తున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ధరూర్ మండలంలోని నెట్టెంపాడు నుండి నీలహళ్లి వరకు అక్కడ నుండి అలాగే కెటి దొడ్డి మండలంలోని పాతపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డును జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గొంగళ్ల రంజిత కుమార్‌మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు నడిగడ్డ ప్రాంతంలో పాలన చేస్తున్నప్పటికి గ్రామాలకు సరైన రోడ్లు కూడా వేయలేరా అని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కమిషన్లకు కక్కుర్తిపడి అభివృద్ధి పనులను దూరంగా నెట్టి వేశారని మీ పాలనలో ఏం అభివృద్ధి చేశారో మీరే ఈ రోడ్డును చూసి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయే తప్పా నడిగడ్డ ప్రాంతంలో ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత కనీసం గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నెట్టెంపాడు నుండి నీలహళ్లి గ్రామం వరకు 5 కి.మీ. వరకు అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయని అలాగే నీలహళ్లి నుండి పాతపాలెం వరకు రోడ్డుపై ఉన్న గుంతలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ అదుపుతప్పి ఎందరో ప్రమాదాలకు గురయ్యారని, అలాగే నీలహళ్లి నుండి పాతపాలెం వాగు వరకు కంకర తేలడంతో ప్రయాణీకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని, చిన్నపాటి వర్షానికి గుంతలమయంగా ఉన్న రోడ్లపై వర్షపునీరు చేరడంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదని ఆరోపించారు. ఇదిలా ఉంటే మరి మిగతా గ్రామాల రోడ్లు ఎలా ఉంటాయో దీన్నిబట్టిఅర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి నెట్టెంపాడు గ్రామం నుంచి నీలహళ్లి వరకు అలాగే నీలహళ్లి నుండి పాతపాలెం వాగు వరకు రోడ్డు వేయాలని లేనిఎడల నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు ఆలూరు వెంకట్రాములు, ధరూర్ మండల అధ్యక్షులు నెట్టెంపాడు గోవిందు, ఉపాధ్యక్షులు మునెప్ప, ఆంజనేయులు, కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శిలు మల్దకల్, అడవి ఆంజనేయులు, మల్దకల్ మండలఅధ్యక్షులువిష్ణు, కార్యదర్శి తిమ్మప్ప, నాయకులు ఆంజనేయులు, జగదీష్, దొడ్డన్న, సర్వేష్, గోపాల్, ఎల్లప్ప, శివన్న, ప్యాట్ల రాములు, నాగేష్, రమేష్, పైటాల నర్సింహులు, మని, అంజి, ఎల్లేష్, వీరేష్, ఉరుకుందు, వీరన్న పాల్గొన్నారు.

## న్యాయ స్థానాల్లో కేసులు సత్వరమే పరిష్కరించాలి

**- ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు**



మాట్లాడుతున్న పిన్సిపల్ జిల్లా మరియు సెషన్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై22 ప్రభాతవార్త:** న్యాయ స్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయ విభాగానికి సంబంధించిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు ఎందుకు సమయమానుకూలంగా పరిష్కరించలేకపోతున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను, సూచనలను తెలియజేశారు. న్యాయ స్థానాల్లో నాన్ బీయిల్ వారంట్లను తక్షణంఅమలు చేసి సాక్ష్యులను సంబంధిత న్యాయ స్థానాల్లో హాజరు పర్చాలని పోలీస్ అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తమ పరిశీలనలో ఉంది. జాప్యానికి సంబంధించిన వివిధ కేసులపై వారి వారి అభిప్రాయాలను జిల్లా న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ సబితా, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ ప్రవీణ్, మౌనిక, అదనపు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు ఉన్నారు.

## దేవాలయాలు సందర్శించుకున్న న్యాయమూర్తి దంపతులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి దంపతులు

**మల్దకల్, జులై22 ప్రభాతవార్త:** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గుబ్బా ప్రభాకర్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాద్‌రావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు చేయించారు. అలాగే శ్రీ విష్ణుమూర్తి దేవాలయాన్ని సందర్శించుకుని పూజలు చేశారు. ఇంకాశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించుకుని కుంకు మార్చన నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యులు న్యాయమూర్తి దంపతులను ఘనంగా శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు.

**అపర తిరుపతి పుస్తకావిష్కరణ:** మల్దకల్ శ్రీస్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయం అపర తిరుపతిగా విలసిల్లాలని కోరుతూ న్యాయమూర్తి సొంత ఖర్చులతో ముద్రించిన 1000 అపర తిరుపతి పుస్తకాలను శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణ మండపంలో ఆవిష్కరించారు. మల్దకల్ శ్రీతిమ్మప్పస్వామి దేవాలయం అపర తిరుపతిగా విలసిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదనాచారి, రమేష్, వి.చంద్రశేఖర్‌రావు, బాబురావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వెంకటన్న, వీరారెడ్డి, ఆర్యవైశ్యసంఘంనాయకులుబాదామి శ్రీనివా సులు, మనసానినాగరాజు, మద్దెలబండనాగరాజు, నరెందర్, రాజు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి**



బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

**వనపర్తి, జూలై22, ప్రభాతవార్త:** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీర్లగుట్ట మెడికల్ ఆఫీసర్ బి.వైష్ణవి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ బీసీ వసతి గృహలలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. సీజనల్ వ్యాధుట పట్ల అప్రమత్తంగా ఉండాలని వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహంలోని ఆవరణచుట్టు పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి మాధవిని ఆదేశించారు. విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా నాదృష్టికి తీసుకురావాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సహజంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశంఉన్నందున విద్యార్థులు అప్రమత్తండా ఉండాలని సూచించారు. వర్షాకాలం వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల వల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు విష జ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని వసతి గృహంలోని వంట గది పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వసతి గృహ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలోమెడికల్ ఆఫీసర్ వైష్ణవి, వసతి గృహ సంక్షేమ అధికారి మాధవి, మెడికల్ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత చర్యలు ముమ్మరం చేయదంతో పాటు భద్రత ప్రమాణాలను పకడ్బందిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశిచారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ సమావేశ మందిరంలో రవాణా, పోలీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, మున్సిపల్, ఆర్టీసీ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై జిల్లా ఎస్పీ కె.మనోహర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా స్థాయి కమిటీ ఆయా శాఖల ద్వారా మరింతగా పటిష్టంగా ప్రణాళిక బద్దంగా చర్యలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే ప్రమాదాలకు ముఖ్య కారణంగా ఉన్న అంశాలపై దృష్టినాసారించాలన్నారు. నేషనల్ హైవేస్ ఆధ్వర్యంలో అవసరమైన మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన పనులు చేపట్టాలన్నారు. జిల్లాలోని పలు రహదారులకు ఆనుకొని ఉన్న హోటల్, దాబాల్లో, వ్యవసాయ పొలాల గట్లు, ఇరుకు రోడ్లు, నాణ్యత లేని రోడ్లు, తదితర అంశాలతో పాటు ముఖ్య జంక్షన్ల అభివృద్ధి, ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు భద్రత పరికరాల ఏర్పాటుకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో పరిపాలన పరమైన ఆమోదాలు ఉంటే వాటిని మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదాలను నివారించే దిశగా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు దోహద పడాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల అవగాహన చర్యలు అలాగే రోడ్డుపై రాత్రి సమయాల్లో ఇసుక రవాణాల్లో ట్రాక్టర్లలో తీసుకెళ్లే సమయాల్లో రేడియం స్టిక్కర్లను ఆయా స్టేషన్ హౌస్ అధికారుల పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డుల్లో సొలార్ బింకర్స్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, ప్రధాన కూడల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోల యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు రోడ్డు మధ్యలో ఆపకుండా డ్రైవర్లకు సూచనలు చేయాలని డీఎంను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మరో వారం రోజుల్లో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే నేషనల్ హైవే ఇతర శాఖ అఇకారులు పూర్తి అవగాహన మరియు నివేధికలతో హాజరు కావాలని సూచించారు. ఆటో ట్రక్, ఆర్టీసీ డ్రైవర్లకు నూతన ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవింగ్ మేలుకోలుపుపై శిక్షణ తరగతులను అందజేయాలని ఆదేశించారు. ఆర్టీసీ డ్రైవర్లకు అందించే శిక్షణ తరగతుల్లో సీపీఆర్‌పై కూడా శిక్షణ ఇవ్వాలని డీఎంహెచ్‌ను ఆదేశించారు. సమావేశంలో డీటీఓ ఎర్రి స్వామి, పంచాయతీ రాజ్ ఈఈ దామోదర్‌రావు, ఆర్‌అండ్‌బీ డి.రమాదేవి, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, ఆర్టీసీ ఆర్‌ఎం, నాగర్‌కర్నూల్‌డీఎం పాల్గొన్నారు.

## బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం



**వెల్దండ, జులై 22 ప్రభాతవార్త:** తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమీక్షా సమావేశంలో తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఓటర్ జాబితాను తప్పులు లేకుండా నమోదు చేయాలని, 18 సంవత్సరాలు పైబడిన వారిని ఓటర్‌గా గుర్తించి నమోదు చేయాలన్నారు. ఓటర్ జాబితాలో మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని, వికలాంగుల నమోదుతో పాటు ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ శంకర్, బీఎల్‌ఓలు ఉన్నారు.

## పీసీసీ రేవంత్‌రెడ్డి సమక్షంలో కొల్లాపూర్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిక



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు ఊపందుకుంది. మాజీ మంత్రి జూపల్లి కృష్ణరావు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారనే విషయాన్ని గుర్తించిన పలువురు నియోజకవర్గ నేతలు, బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమవుతున్నారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నంబావి, పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాలకు చెందిన పలువురు నేతలు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారి చిదంబర్‌రెడ్డి, వెంకటస్వామి, కృష్ణయ్య, కొండల్‌రావు, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులు రేవంత్‌రెడ్డికి పుష్పగ్ఛుం అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి, రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, బాలస్వామి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

## పార్లమెంట్‌లో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణకై తీర్మానం చేయాలి

**- తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు**



**వనపర్తి టౌన్, జూలై22, ప్రభాత వార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణకై తీర్మాణం చేయాలని తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు మాట్లా దుతూ.... వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, తెలంగాణ శాసన సభలో 8వ సెషన్‌లోని నాలుగో సమావేశంలో 10ఫిబ్రవరి 2023న తీర్మా నం ఆమోదించబడిందని ఆయన గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని, వాల్మీకి బోయలతో పాటు బేదర, కిరాతక, నిషాది, పెద్ద బోయ, బాట్ మదురాలు, చామర్ మదురాలను వాల్మీ కి బోయలను ఎస్టీలో చేర్చాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారని ఆయన గుర్తు చేశారు. వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో చేర్చాలని 1956 నుండి ఉద్యమాలు చేస్తున్నారని, చెల్లప్ప కమిషన్ రిపోర్టు ఆధారంగా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపారని ఆయన తెలిపారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో తిరిగి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాల్మీకి నాయకులు బుసిరెడ్డి స్వామి నాయుడు, అరవింద్ నాయుడు, గోవర్ధన్ నాయుడు, రామచంద్ర వాల్మీకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక గర్జన పోస్టర్ విడుదల

**అమరచింత, జూలై22, ప్రభాతవార్త:** ఆగస్టు 4న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర జరిగే కార్మిక గర్జన పోస్టర్‌ను శనివారం అమరచింత మండల పరిధిలోని మస్తీపూర్ గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణంలో 20 లక్షల మంది భవన నిర్మాణంలో పని చేస్తున్నారని వారికి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఎద్దేవా చేశారు. భవన నిర్మాణంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం మోటార్ సైకిల్ ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. 60 సం.లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం 5వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులు సహజ మరణానికి ప్రభుత్వం 5 లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కారినమకుల హక్కుల సాధనకై ఆగస్టు 4న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తు న్నారని ఈ ధర్నాకు వేలాదిగా తరలిరావాలని ఆయన కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మన్యం, శ్రీను, నాగరాజు, దేవన్న, నరసింహ, రామన్న, మన్యం, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గొర్రెల యూనిట్లు పంపిణీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు బూరెడ్డిపల్లిలో శనివారం రెండో విడుత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన 7యూనిట్లను వార్డు కౌన్సిలర్ గుండు ఉమాదేవి సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక గొల్లకురుమల సంక్షేమానికి సర్కార్ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా గొర్ల కురుమలకు సబ్సిడీ కింద గొర్రెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ పడాల మల్లేశ్, జీటిఎన్ నర్సింహ, బూరెడ్డిపల్లి యాదవ సంఘం అధ్యక్షుడు, మాజీ వార్డు సభ్యుడు కేశవులు తదితరులు పాల్గొన్నారు.



గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ ఉమాదేవి, సభ్యులు

# జిల్లాలో పండ్ల తోటలను ప్రోత్సహించాలి

● మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన వివరాలను వెల్లడించాలి ● హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి ● సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని, జులై 31 నాటికి జిల్లాలో 2565 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతుల వివరాలను గుర్తించి ఉపాధి హామీ పథకంలో అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఎంపీడీఓలను ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలో సాగుకు తీసుకోవాల్సిన చర్యలు, వర్షాకాలం సీజన వ్యాధులపై అదనపు కలెక్టర్ కుమార్ దీప్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమావేశం నిర్వహించారు. పండ్ల తోటల సాగుకు సంబంధించి ఉపాధి హామీ పథకం క్రింద ఉద్యానవన శాఖతో కలిపి చేపట్టే చర్యలను వివరిస్తూ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అధికారులు ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పండ్ల తోటల సాగును ప్రోత్సహించి దానికి అవసరమైన పెట్టుబడిని, రైతులకు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 2565 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించడం జరిగిందని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న కారు రైతులను లబ్ధిదారులుగా ఎంపిక చేయడానికి అర్హులని, వీరికి సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు పండ్ల తోటల పెంపకానికి అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వం సమకూరుస్తుందని, ఇందు కోసం ఉపాధి హామీ పథకం, పీఎంకేవైసీ పథకాలను వినియోగించడం జరుగుతుందని తెలిపారు. పండ్ల తోటల సాగుక్రింద బ్రతికిన ప్రతి మొక్కకు 3సంవత్సరాల పాటు నెలకు రూ.10ల చొప్పున వాచ్ అండ్ వార్డ్ చెల్లించడం జరుగుతుందని, లబ్దిదారుడికి మట్టి నమూనా చార్జీలు చెల్లిస్తామని, మొక్కల ఎరువులకు 3 సంవత్సరాల పాటు ప్రతి చెట్టుకు సంవత్సరానికి రూ.50లు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి గరిష్టంగా ఐదు ఎకరాల వరకు మాత్రమే ఈ పథకం అమలవుతుందని, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు ఉపాధి హామీ సిబ్బంది సంయుక్తంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, లబ్దిదారుల జాబితా ఎంపిక చేసిన తర్వాత ఆగస్టు 15లోపు పండ్ల తోటల సాగుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. చెంచు పెంటల్లో తాగునీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎంపీడీఓలు ప్రతి రోజు తమ మండల పరిధిలోని గ్రామాలను సందర్శించాలని, తప్పనిసరిగా హరితహారంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. 461 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంకా 78 క్రీడా ప్రాంగణాలు ఎందుకు పూర్తి చేయలేదు వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వారం రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్‌రావు, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, డీపీఓ కృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అడిషనల్‌డీఆర్‌డీఓ రాజేశ్వరి, డీఎల్‌పీఓలు రాంమోహన్‌రావు, ఫండరినాథ్, ఎంపీడీఓలు, ఎంపీఓలు సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలతో మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా కృషి చేయాలి: జిల్లా కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** జిల్లాలో విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడకుండా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల, నియంత్రణ అక్రమ రవాణా, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎస్పీ ఓఆర్డి జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ కె.మనోహర్‌లతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన డ్రగ్ అడిక్షన్ కేసుల వివరాలను ఆరా తీశారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి సరఫరా కొరకు వినియోగించే ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకం ఉన్న పిల్లలను బాధితులను పరిగణించి వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, దీని కోసం జిల్లాలో అందు బాటులో ఉన్న సైకలాజిస్ట్ సేవలు విస్తృతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గల వారికి సిగరెట్లు, 21 వయస్సు లోపు గల వారకి మద్యం విక్రయించడానికి వీలు లేదని, జిల్లాలో ఉన్న మద్యం షాపులు, పాన్ డబ్బాలలో అకస్మిక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఆర్టీసీ నిర్వహించే కార్గో ద్వారా ఎగుమతులు, దిగుమతులపై పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, యువతకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న మెడికల్ షాపుల్లో హెచ్ డ్రగ్స్ అమ్మకాలు డిజిటల్ విధానం ద్వారా మాత్రమే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అవసరమైన ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలను పోలీస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని, మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం జువెనైల్ యాక్ట్ గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖ సమన్వయంతోసర్వైలైన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. అధికారులందరు సమిష్టిగా కృషి చేసి మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా క్రైమ్ డీఎస్పీ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, డీపీఓ కృష్ణ, డీఈఓ గోవిందరాజులు, డీఎస్పీలు మోహన్‌కుమార్, నరసింహ, కృష్ణ, మున్సిపల్ కమీషనర్లు, ఆర్టీసీ ఆర్ఎంఓ చందునాయక్, నాగర్‌కర్నూల్ డీఎంఓ, పోలీస్, ఇతర సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## మొక్కలు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతాయి

-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో పచ్చని భూమి కోసం చెట్ల పెంపకం అనే కార్యక్రమం ద్వారా శనివారం నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోజిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ యూనియన్ బ్యాంక్ వారు అందించిన వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు మొక్కలు వనాలు దోహద పడుతాయన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా ప్రతిసంవత్సరంహరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిశోర్ పాండే మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈరోజు దేశవ్యాప్తంగా భారతదేశంలో 10లక్షల మొక్కలు నాటాలనే కార్యక్రమాన్నినిర్వహిస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోను వేప, మామిడి, జామున్ చెట్లతో పాటు ఔషధ మరియు పండ్ల 100 మొక్కలను నాటారు. అందులో భాగంగానే జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లా ఉద్యా నవన శాఖ అధికారి చంద్రశేఖర రావు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## తోపుడు బండ్ల హమాలీ సంఘానికి రూ.5 లక్షలు నిధులు కేటాయించిన మంత్రి


హమాలీ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి టౌన్, జూలై22, ప్రభాత వార్త:** పట్టణంలోని తోపుడుబండ్ల హమాలీ సంఘం భవన నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రూ.5 లక్షల నిధులు కేటాయించి, నిధుల మంజూరు పత్రాన్ని సంఘం సభ్యులకు అందజేసి, భవన నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రివెంట జడ్పీ చైర్మన్‌లోక్‌నాథ్‌రెడ్డి, పట్టణ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్‌గౌడ్, వైస్ చైర్మన్ వాకిటిశ్రీధర్, రాష్ట్రమార్కెట్ డైరెక్టర్‌విజయకుమార్, తిరుమల మహేష్, పట్టణ ఇంచార్జ్ అరుణ్ ప్రకాష్, కౌన్సిలర్లు విభూది నారా యణ, ఉంగ్లంతి రుమల్, నాగన్నయాదవ్, గోపాల్ యాదవ్, నక్క రాములు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి రైతు సంఘం అధ్యక్షుడు దేవర్లనరసింహ, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు నీలస్వామి, చీర్ల కేశవులు, శ్రీను, నాగవరం నరేష్, విక్రమ్, యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వార్డుల సందర్శన..

- డ్రైనేజీలను శుభ్రం చేయించిన చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త:** వర్షాకాలం దృష్ట్యా జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పర్యటించారు. జేసీబీ సహాయంలో డ్రైనేజీలకు శుభ్రం చేయించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ మహెమూద్ షేక్, సిబ్బందితో కలిసి 19వ వార్డులో పర్యటించారు. డ్రైనేజీలకు సందర్శించి చెత్తను తొలగింపచేయించారు. వర్షాల కారణంగా నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై నిమ్మబావిగడ్డ వద్ద డ్రైనేజీలో చాలా రోజులుగా మట్టి చెత్త పేరుకు పోవడంతో నీళ్ల ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొన్నది. దీంతో జేసీబీ సాయంతో మట్టి, చెత్తను తొలగించేశారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు ఇఫ్తేకార్, అజార్, 18వ వార్డు ఇన్‌చార్జి ముఖీద్, 5వ వార్డు నాయకుడు కొండల్, మహెమూద్, మున్సిపల్ శానిటేషన్ అధికారులు నగేశ్, జవాన్‌లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## పీర్లగుట్టపై చెత్తా చెదారం తొలగింపు

- పీర్ల పండుగను పురస్కరించుకుని పారిశుద్ధ్య పనులు


పీర్ల గుట్టపై జేసీబీ ద్వారా శుభ్రం చేయిస్తున్న బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వజ్రాల రమేష్

**వనపర్తి టౌన్, జూలై22, ప్రభాతవార్త:** పీర్ల పండుగను పురస్కరించుకుని పీర్లగుట్ట మీద ఉన్న చెత్తా చెదారాన్ని జేసీబీ ద్వారా బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు వజ్రాల రమేష్ శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పీర్లగుట్ట కేవలం ఒక గుట్ట మాత్రమే కాదు అది వనపర్తి ప్రజల సాంస్కృతిక చిహ్నంఅని, ప్రతి పీర్ల పండుగ సందర్భంగా గుట్ట పరిసర ప్రాంతమంతా ఒక కోలాహలం ఉంటుందని, మత సామరస్యపు ప్రతీక అని ఆయన తెలిపారు. అనేక కుటుంబాలు పీర్ల గుట్ట మీద పీర్లకు పీర్ల పండుగ సందర్భంగా మొక్కులు చెల్లించుకుంటా రని, గట్టు మీనయ్యగా కొలుస్తారని ఆయన తెలిపారు. అనేక ఇండ్లల్లో గట్టు అనే పేరు కూడా తమ పిల్లలకు పెట్టుకోవడం ఒక ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం పీర్ల పండుగ సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో వస్తుండడంతో గుట్ట పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరిగిందన్నారు.

## అజ్జామ్ కుటుంబానికి మేఘారెడ్డి ఆర్థిక సాయం


అజ్జామ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీఎంఆర్ యువసేన నాయకులు

**పెబ్బేరు, జూలై22, ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణానికి చెందిన ఎండి అజ్జామ్ ఇటీవల మృతి చెందాడు. మృతుని ఆర్థిక పరిస్థితి గురించి వన పర్తి నియోజకవర్గ నాయకులు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి పెబ్బేరు టీఎంఆర్ యువసేన నాయకులు తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆయన రూ.5వేలు పంపగా టీఎంఆర్ యువసేన నాయకులు శని వారం అజ్జామ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుని కుటుంబానికి అండగా మేఘారెడ్డి

**పెద్దమందడి, జూలై22, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుని కుటుంబానికి శనివారం వనపర్తి జిల్లా నాయకులు ఎంపీపీ మేఘారెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. పెద్దమందడి మండల పరిధిలోని మనిగిల్ల గ్రామానికి బ్రహ్మయ్య చారి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే గ్రామానికి చెందిన మాదన్న గౌడ్ అనే వ్యక్తి శనివారం మృతి చెందడంతో గ్రామ టీఎంఆర్ యువసేన నాయకులు మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆయన ఇరువురి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున పంపించారు. ఈ సందర్భంగా గ్రామ టీఎంఆర్ యువసేన నాయకులు సుంచరమోని వెంకటయ్య, తిరుపతయ్య, శివ యాదవ్, వడ్డె వెంకటేష్, బాలపీరు, మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న టీఎంఆర్ యువసేన నాయకులు

## కస్తూర్బాగాంధీ నీటి ఎద్దడి నివారణకు కృషి చేసిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి


మోటార్‌ను బిగించి నీటి సౌకర్యాన్ని కల్పించిన దృశ్యం

**వెల్దండ, జులై 22 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బోరు ఉన్న మోటార్ లేకపోవడంతో తాత్కాలికంగా వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తుండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను గుర్తించి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి స్పందించి రూ.30వేలు విలువ చేసే త్రి ఫేస్ మోటార్‌తో పాటు స్టార్టర్‌ను అందించి నీటి కష్టాలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ దశరథ్‌నాయక్, పంతులనాయక్, జయరాంనాయక్, లక్ష్మణ్‌నాయక్, కృష్ణయ్య, కీమ్యా, పర్వతాలు, శంకర్, రమేష్‌నాయక్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

## హుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**పెబ్బేరు, జూలై22, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం శాగాపూర్ వై గ్రామంలో టీఆర్ఎస్ కార్యకర్త ఖలీల్ తండ్రి హుస్సేన్ గుండెపోటుతో బుధవారం రాత్రి మరణించిన విషయం తెలుసుకుని మంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని పరామర్శించి మంత్రి పంపించిన రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారని బీఆర్ఎస్ పార్టీ పెబ్బేరు మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ అన్నారు. వారితో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిదులు , వైస్ ఎంపీపీ కోట్ల బాల్‌చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సందేపాగా వెంకటయ్య, పగుడాల కృష్ణ, పరమేష్ నాయి, మర్యాద సందీప్ రెడ్డి, మంగరాయి మన్యం ,తోమాలపల్లి మధు, చిన్నపాగరామకృష్ణ, గువ్వల గోపి, సాయినాయి, చేగుంట సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ నమోదు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి: తహసీల్దార్

**వీపనగండ్ల, జూలై22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఆర్ 2023 బిఎల్‌వో యాప్ ఓటర్ జాబితాల రూపకల్పన శిక్షణ కార్యక్రమం బూత్ లెవెల్ ఆఫీసర్ల కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలోవీపనగండ్ల మండలకేంద్రంలోని28 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కొత్తగా ఓటరు నమోదు ఎలా చేయాలి, ఓటర్ లిస్టులో చని పోయిన వారి పేరుఎలా తీసివేయాలో మాస్టర్ ట్రైనర్స్ అంగన్వాడీ ఉపాధ్యాయులకు, సూపర్‌వైజర్లకు శిక్షన ఇచ్చారు. ఎలక్షన్స్ చరవాణిలో యాప్ ద్వారా ఓటర్ నమోదు కార్యక్రమం గూర్చి వివరించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు తప్పకుండా పాటిస్తు ఇంటింటికి తిరిగి ఓటరు జాబి తాను రూపొందించాలని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో, వీపనగండ్ల తహసీల్దార్ పాండునాయక్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



# ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయవద్దు

-మాల మహానాడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల శ్రీనివాసులు


మాట్లాడుతున్న మాల మహానాడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల శ్రీనివాసులు

**కల్వకుర్తి, జులై 22 ప్రభాతవార్త:** రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలు మానుకోవాలని మాల మహానాడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో తెలంగాణ మాల మహానాడు కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు సామ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఇది ప్రాంతీయ వ్యత్యాసమే తప్ప మాదిగలకు అన్యాయం ఏమి జరగలేదు, మాదిగలకు చర్మకార వృత్తి ఉంది కాబట్టి వారికి ప్రభుత్వం నుంచి లబ్ది పొందే అవకాశం ఉందన్నారు. కానీ మాలలకు ఆ అవకాశం లేదని, మొత్తంగా ఎస్సీల ఐక్యతను దెబ్బతీసే కుట్ర అని ఆయన పేర్కొన్నారు. 2004 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను కొట్టివేసిందని, ఎస్సీ కులాల జాబితాలో జోక్యం, పునర్ వర్గీకరణ వంటివి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని సుప్రీంకోర్టు ప్రకటించిందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కిషన్‌రెడ్డి, బీజేపీ అధిష్టానం ఓట్ల కోసం ఇలాంటి నీచమైన వర్గీకరణకు సానుకూలంగా చెప్పడం విడ్డూరమని, గతంలో నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపడంతో ఆయన ప్రభుత్వాన్ని కూల్చిన విధంగానే ఇప్పుడు ఏ పార్టీ అయితే వర్గీకరణకు అనుకూలంగా ఉంటుందో ఆ ప్రభుత్వాన్ని సైతం అధికారంలోకి రాకుండా చేస్తామన్నారు. ప్రస్తుతం ఎస్సీ జనాభాను లెక్కించి వారికి పెంచాల్సిన రిజర్వేషన్లను పెంచి న్యాయం చేయాలి కానీ అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీలను విభజించి దేశ ద్రోహులు కావద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కనుక భారతి, కల్వకుర్తి తాలూకా కార్యదర్శి గోరటి మురళీ, పంజుగుల గ్రామ అధ్యక్షులు జక్కుల శేఖర్, కల్వకుర్తి పట్టణ మహిళ అధ్యక్షులు కందుకూర్ ఝాన్సీ, కల్వకుర్తి పట్టణ మహిళా జనరల్ సెక్రటరి పేరుమల్ల మంగ, ప్రచార కార్యదర్శులు పావని, దొడ్డి మణెమ్మతదితరులు ఉన్నారు.

# మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

-గిరిజన స్త్రీలకు భద్రత కరువు : డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ


మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**అచ్చంపేట, జులై22 ప్రభాతవార్త:** మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, హింసలు ప్రధాని మోడీకి కనిపించడం లేదా అని, భారతదేశంలో గిరిజన మహిళలకు రక్షణ కరువైందని, మహిళలకు భద్రత కల్పిస్తామని, మహిళల రక్షణే ధ్యేయమంటున్న బీజేపీ ప్రభుత్వానికి మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అరాచాకలు కనిపించడం లేదా అని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న హత్యాచారాలకు నిరసనగా పీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సునితరావు ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రోహిణిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ భారతదేశ శత్రు దేశాలపై అనునిత్యం నిఘా పెడుతూ కాపాల కాస్తున్న భారత సైనికుల భార్యలకే భద్రత ఇవ్వలేని బీజేపీ ప్రభుత్వం భారతబిడ్డలకు ఎలాంటి భరోసా కల్పిస్తుందని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోడీ భారత మహిళలకు క్షమాపణలు చెప్పాలని, మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంలో దళిత, గిరిజన మహిళలకు భద్రత కరువైందని, బీజేపీని బొంద పెడితేతప్ప మహిళలకు భద్రత ఉండదన్నారు. 3 నెలల నుంచి అల్లర్లు, హత్యాచారాలు, హింసలు చోటు చేసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోకుండా నివసిస్తున్న ప్రజల మరణాలకు కారణమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ అల్లర్ల విషయంలో నేటికి కూడా కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోకపోవడం మరింత హింసకు ప్రేరేపిస్తూ మహిళలపై లైంగిక దాడులకు, హత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న సంఘటనలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ తరుపున ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శారదమ్మ, నియోజకవర్గ మహిళా నాయకురాలు విజయలక్ష్మి, సుశీల, పద్మభాయి, కౌన్సిలర్ మధు, సంధ్య, నూరి బేగం, చిట్టెమ్మ, ఇందిరమ్మ, శ్యామల, భాగ్యమ్మ, ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.

## వీపనగండ్ల మండల రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీలో చేరిక

- తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ - కాంగ్రెస్ గెలుపే నా ధ్యేయం: ఎత్తం కృష్ణయ్య - జూపల్లి కృష్ణారావు, అభిలాష్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక


పీసీసీ అధ్యక్షుడు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎత్తం కృష్ణయ్య, అనుచరులు

**వీపనగండ్ల, జూలై22, ప్రభాతవార్త:** మండల రైతుబంధు సమితి సమన్వయ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య బీఆర్ఎస్ పార్టీ నుండి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వీపనగండ్ల మండల కేంద్రం నుండి తమ అనుచరులైన 50 మంది కార్యకర్తలతో జూపల్లి కృష్ణారావు, రంగినేని అభిలాష్ రావు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరామని వారు అన్నారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి నా వంతుగా కృషి చేస్తానని , ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కలుపుకొని కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తామని వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రాజు, ముత్యాల రాము, బాబు, గొల్ల ఆంజనేయులు, సురేష్, వెంకటేష్, బాలకృష్ణ, బాబు, స్వాములు, కురుమూర్తి, గొల్ల నరసింహ, వెంకటయ్య, నాగయ్య, చిన్న మల్లయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు జెఏసి వినతి



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం కింద దాదాపు 16 వేల మంది కార్మికులు కాంట్రాక్టు పద్దతిన వివిధ ఏజెన్సీల కింద ఎలక్ట్రిషన్ ట్విట్టర్స్ ఆపరేటర్స్ వాల్ ఆపరేటర్స్, సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారని వీరికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నం. 60 ప్రకారం జీతాలు పెంచాలని నేడు మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల జెఏసి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అదేవిధంగా రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకాన్ని దక్కించుకున్న బడా కాంట్రాక్టర్లు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడికి గురి చేస్తున్నారని మిషన్ భగీరథ పథకం కన్స్ట్రక్షన్ పూర్తయ్యి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నడుస్తున్నప్పటికి వారికి తక్కువ జీతాలు ఉన్నటువంటి కన్స్ట్రక్షన్ పూర్తయి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నడుస్తున్నప్పటికి వారికి తక్కువ జీతాలు ఉన్నటువంటి కన్స్ట్రక్షన్ జీవోను ఇస్తున్నారని వారు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులనాయకులు వడ్డె మహేష్, ఐఎఫ్‌టి జిల్లా నాయకుడు బుట్టో తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి: జిల్లా కలెక్టర్



ఓటింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఐడిఓసిలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు అవగాహన కార్యక్రమంలో రైతులకు, జిల్లా అధికారులకు, కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియో గంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూ డు నెలల్లో ఎన్నికలు రాబోతున్నందున ప్రజలందరు ఓటు వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అందరు కూడా మీకున్న పోలింగ్ స్టేష న్‌లో మీ పేర్లు లిస్టులో ఉన్నాయా లేదా అని ఒకసారి చెక్ చేసుకోవాలని అన్నారు. వివి ప్యాట్, బ్యాలెట్ యూనిట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తదితరవాటిపై కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూరింటెండెంట్ వరలక్ష్మి, ఇడి ఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ చెన్నమ్మ, ఆర్అండ్‌బిప్రగతి, సరఫరాలఅధికారి రేవతి, ప్రజలు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల పరిస్థితి మారలేదు

● బిజెపి జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 22 ప్రభాతవార్త:** పాలమూరు పట్టణంలో చినుకు పడితే తడిసి ముద్దయి లోతట్టు ప్రాంతాలైన గణేష్‌నగర్, రామయ్య భౌలి, మేకలబండ ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. గతేడా ది మంత్రి లోతట్టు ప్రాంత ప్రజలకు, పిల్లలకు నీళ్ల రాకుండా ప్రత్యామ్నయ మార్గాలు చేపట్టి సురక్షితంగా జీవనం కొనసాగే విధంగా పాలమూరును సుందరంగా చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిపోతున్న వారి పరిస్థితుల్లో మార్పురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గణేష్‌నగర్‌లోని ఎర్రగుంట తూము నుంచి నీళ్ల రావడంతో ఆ ప్రాంతం నీటిమయమైందని అన్నారు. పెద్ద చెరువు సుందరీకరణ పేరుతో వర్షపు నీటిని చెరువులోకి రాకుండా మట్టి వేయడంతో మా నీటికి వెళ్లే మార్గం లేకచుట్టు పక్కల ఉన్నఇళ్లల్లో చేరే పరిస్థితి నెలకొందని అన్నారు. చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటజిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ వర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి శేరి పాండురంగారెడ్డి, పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్ ఉన్నారు.

## ఎస్పీలకు విడియో కాన్ఫరెన్స్ ద్వారా డిజిపి సమీక్ష

**నారాయణపేట ప్రతినిధి, జులై 22 ప్రభాతవార్త:** పోలీస్ కమిషనర్లకు, జిల్లాల ఎస్పీలకు శనివారం మధ్యాహ్నం డిజిపి అంజనీకుమార్ విడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాల పరిధిలో ముందస్తు భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలని సూచించారు. రౌడీలు, కెడిలు, సస్పెక్ట్‌పై నిఘా ఏర్పాటు చేయాలని సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేయాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకై పోలీస్‌శాఖ చేసే కృషి ఆయా ప్రాంతాల అభివృద్ధికి కారణమవుతుందని డిజిపి అన్నారు. రాష్ట్రంలో ప్రతి పోలీస్ స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పని చేయడం వలన నేరాల నిరోధన, నేరాల పరిశోధన, న్యాయస్థానంలో శిక్షల ఖరారుతో పాటు పోలీస్ కార్యాలయాలు ఆధునీకరణ పూర్తి చేయగలిగామన్నారు. వర్టికల్స్ వాటి పనితీరు, హెచ్‌ఆర్ఎంఎస్ వినియోగం, నేరాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు, పెండింగ్ కేసులు మొదలగు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ కె. సత్యనారాయణ, డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సిఐలు రవిబాబు, శ్రీకాంత్‌రెడ్డి, జనార్ధన్, రామ్‌లాల్, ఆర్ఐలు డేవిడ్ విజయ్‌కుమార్, కృష్ణయ్య, డిపిఓ సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఎస్సైలు నవీన్, సునిత, డిపిఓ, డిసిఆర్‌బి, ఎస్బీ, ఐటికోర్ స్టాఫ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనకు బాధ్యుల్ని శిక్షించాలని పీఎస్‌లో ఆప్ ఫిర్యాదు



**భూత్పూర్, జులై 22 ప్రభాతవార్త:** మణిపూర్‌లో ఓ ఆదివాసి మహిళను వివస్త్రను చేసి అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి ఉరి తీయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దేవరకద్ర నియోజకవర్గం ఇంఛార్జి గద్దం ఎల్లప్ప శనివారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లో నూతన సిఐ రామకృష్ణను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు మణిపూర్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు పేర్కొన్నారు.

## సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌కు ఘన సన్మానం

**భూత్పూర్, జులై 22 ప్రభాతవార్త :** భూత్పూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను శనివారం భూత్పూర్‌కు చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. సీఐ రామకృష్ణను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గద్దం యాదయ్య, బజార్ పరశురాం, గద్దంశ్రీను, మునయ్య, వి. యాదయ్య, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.



# ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు పండ్ల తోటల పెంపకం

- నిత్యవసర పండ్లు, కూరగాయల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం : వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హాజరైన జిల్లా అధికారులు

**వనపర్తి, జులై22, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని పట్టణంతో సహ గ్రామీణ ప్రాంతాలకు సైతం అవసరమైన పళ్ళు, కూరగాయలు ఇతర ప్రాంతాల నుండి తెప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొందని దీనిని అధిగమించడానికి ఇక్కడి రైతులకు అవగాహన కల్పించి సాగుకు సబ్సిడీ కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్అన్నారు. ఉపాధి హామీ, ఉద్యానశాఖ ద్వారా వెనుకబడిన కులాలు, తెగల వారితో పాటు 5 ఎకరాల కంటే తక్కువ ఉన్న ఇతర వర్గాల చిన్న సన్నకారు రైతులకు ఉపాధి హామీ, ఉద్యాన శాఖ ద్వారా సబినసడీ ఇచ్చి పళ్ల తోటలు సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో రైతులకు ఏ విధంగా అవగాహన కల్పించాలి అనే అంశాలపై శనివారం మధ్యాహ్నం ఐడిఓసి ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ తిరుపతి రావు తో కలిసి వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఎంపీడీవోలు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తు ప్రభుత్వం ద్వారా రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెట్‌లో ఎలాంటి పంటకు వేస్తే రైతు లాభం అధికంగా వస్తుంది మార్కెట్ డిమాండ్, సరఫరాపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, టీఏలు రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. రైతులతో మాట్లాడి వారికి ఇష్టమైన ఉద్యానవన పంట వారి భూమిలో ఎలాంటి పంటలకు అనువైన వాతావరణం ఉంది, మార్కెట్‌లో ఆ పంటకు ఉన్న డిమాండ్ ఎంటి, వాటి సంరక్షణ ఎలా చేయాలి అనే పూర్తి అవగాహన కలినపంచడం జరగాలని ఆదేశించారు. వనపర్తి జిల్లాలో మొదటి దశలో 1835 ఎకరాల్లో పళ్ల తోటల సాగుకులక్ష్యంగా నిర్దేశించుకోవడంజరిగిందన్నారు. సబ్సిడీపై మొక్కలు ఇవ్వడం, ఉపాధి హామీ ద్వారా గుంతలు తవ్వించడం, సబ్సిడిపై డ్రిప్ చేయించడం జరుగుతుందని అదే విధంగా పంట చేతికి వచ్చే వరకు మొక్కకు ఎరువులు, మందుల పిచికారి ఇతర సంరక్షణ నిమిత్తం మొక్కకు రూ.50 చొప్పున నేరుగా రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతి రావు, ఉద్యానవన జిల్లా అధికారి సురేష్, గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ నర్సింహులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, ఎంపీడీవోలు, ఏవోలు, ఏఈవోలు, టీఏలు సీఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తాం

● ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు విధానాన్ని వివరిస్తాం ● ఓటర్లు, ప్రజలు ఈ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ జి. రవినాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 22 ప్రభాతవార్త:** రాబోయే కొన్ని నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంరతాల (ఈవిఎం) సంచార వాహనాల ద్వారా ఓటర్లలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు జిల్ల కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. శనివారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సమదాయ ఆవరణలో జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఈవిఎంల ప్రదర్శన సంచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాటాడుతూ ఓటువేసే సమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేసే అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకుగాను ప్రతి నియోజకవర్గానికిఒక ఈవిఎం, సంచార వాహనంతో పాటు, నియోజకవర్గ కేంద్రంలో ఉండేలా మరో స్టాటిక్ వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వాహనాలతోపాటు, అధికారులు వచ్చి ఓటర్లకు ముఖ్యంగా కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి, గతంలో ఓటు వేసిన వారికి సైతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఎలా ఓటు వేయాలో చూపిస్తారని తెలిపారు. ఈ సంచార వాహనాల వల్ల పట్టణ ప్రాంతలలో సైతం ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, డిఆర్‌డిఓ యాదయ్య, హౌసింగ్ ఈఈ భాస్కర్, సమాచార శాఖఏడి వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయ ఏఓ శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు అచల ప్రసన్న తదితరులు ఉన్నారు.

## సభ్య సమాజం తలదించుకునేలా మణిపూర్‌లో మహిళల పరిస్థితి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్

**వనపర్తి టౌన్, జులై22, ప్రభాతవార్త:** సీపీఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలో దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో రెండో రోజు పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ... బీజేపీ అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై చెలరేగుతున్న దౌర్జన్యాలు అరికట్టే చర్యలు తీసుకోకుండా నిందితుల వైపు మద్దతుగా ఉన్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, ఒక వైపు బేటీ బచావో అంటున్న బీజేపీ నాయకుల పాలనలో సమాన్య గిరిజన మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, ఈ ఘటనపై తక్షణమే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకుయావజ్జీవ కారాగార శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. జూన్ 6వ తేదీన ఇద్దరు కుకీ తెగ మహిళలను నగ్నంగా ఊరేగింపు దుర్మార్గులను శుక్రవారం పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు నిలదీసే వరకు అరెస్టు చేయని అక్కడి బీజేపీ సీఎం బీరెన్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని వారు కోరారు. బీజేపీ విధానాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేశాక గత్యంతరం లేక కొందరు నిందితులను అరెస్టు చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, జీఎస్ గోపి, మేకల ఆంజనేయులు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బస్ పాస్‌కోసం వికలాంగులు దరఖాస్తు చేసుకోండి

**చిన్నచింతకుంట, జులై 22 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వికలాంగులు బస్‌పాస్ కోసం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉదయం 10 గం.లకు దరఖాస్తులు చేసుకోవాలని మహబూబ్‌నగర్ డిపో అధికారి శ్యాంసుందర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి బస్సులో 50 శాతం రాయితీతో ప్రయాణం చేయడానికి అర్హులైన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ సదరం సర్టిఫికెట్ 1 ఫొటో, రూ.50 వేలు చెల్లించాలని తెలిపారు. అంగవైకల్యం కనిపించే విధంగాఫొటో ఉండాలని ఆయన తెలిపారు. వికలాంగులకు 40 శాతం పైన గ్రుడ్డివారికి 100శాతం, మెంటల్ 69 శాతం తక్కువ ఉండకూడదని లెప్రసీ 40 శాతంపైన ఉండాలని తెలిపారు. వికలాంగులు బస్ పాస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## మొహరం పండగకు ఆహ్వానం

**అలంపూర్, జులై 22 ప్రభాతవార్త:** ఉండవల్లి మండలం ప్రాగటూరు గ్రామస్తులు మాజీ జడ్పీటిసి వడ్డేపల్లి శ్రీనివాసులును కలిసి తమ గ్రామంలో జరిగే మొహరం పండగకు హాజరు కావాల్సిందిగా కోరడం జరిగింది. ఈ సందర్భంగా వడ్డేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సామరస్యానికి ప్రతిక అయిన మొహరం పండగను కులమతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో సంబరంగా జరుపుకోవాలని కోరడం జరిగింది.

## క్లూస్ టీం ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ప్రశంస

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌క సంబంధించిన ఒక కేసును ఛేదించిన విషయంలో క్లూస్ టీం ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ప్రశంస అందుకున్నారు. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం డీజీపీ అంజనీకుమార్ రాజేంద్రప్రసాద్‌కు ప్రశంసా ప్రతం అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగంచుకొని కేసును చేధించిన విషయంలో అభినందించారు. జిల్లా పేరు ప్రఖ్యాతలు రాష్ట్ర స్థాయిలో తీసుకెళ్లి ప్రశంసా పత్రం పొందడపై ఎస్పీ నరసింహ రాజేంద్రప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## మాతృమూర్తికి ఘన నివాళి

**వనపర్తి, జులై22, ప్రభాతవార్త:** జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రిమాతృమూర్తి సింగిరెడ్డి తారకమ్మ 4వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రజాప్రతి నిధులు ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు నారా యణ, నాగన్న యాదవ్, రాములు, మాజీ కౌన్సిలర్ ఉంగ్లంతిరుమల్, తోపుడుబండ్ల సంఘంఅధ్యక్షులుబాలస్వామి, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



## బీచుపల్లిలో ఆంజనేయస్వామి క్షేత్ర చరిత్ర పుస్తక ఆవిష్కరణ



కోదండ రామాయంలో చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, జులై 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పవిత్ర కృష్ణానది తీరన కోదండ రామస్వామి ఆలయంలో శనివారం శ్రీరంగాపురం గ్రామంలో చిన్నకిష్టమ్మ శ్రీ పోతేదార్ దామోదరచార్యుల దంపతులకు జన్మించిన పోతేదార్ రాఘవాచారి రచించిన ఆంజనేయస్వామి క్షేత్ర చరిత్ర పుస్తకాన్ని శనివారం ఆలయంలో ఆవిష్కరించారు. పుస్తక రచయిత ఉపాధ్యాయ వృత్తిలో 35 సంవత్సరాలు పనిచేసి ఎందరో విద్యార్థులకు సాహిత్యం, జ్ఞాన అందించిన వీరి తల్లిదండ్రుల నుండి కూడా ఎంతో క్రమశిక్షణ కలిగిన కీ.శే॥ అయిన తనభార్య సావిత్రమ్మ ఆలోచన విధానం అంతేకాక వారి కుటుంబం, కూతుళ్లు, అల్లుళ్ల ప్రోత్సాహంతో జపస్మృతులనుఆధారంగా చేసుకుని ఎన్నో సంవత్సరాల బీచుపల్లి పుణ్యక్షేత్రం, పరిసరాలను పరిశీలించి ఇక్కడ వాల్మీకి పూజారుల నుండి, వ్యాసరాయల వారి చరిత్రను తెలుసుకుని తనదైన శైలిలో అన్ని రకాలుగా చరిత్రను సేకరించి ఎన్నో సంవత్సరాలు కష్టపడి పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరుగాంచి లక్షలాదిమంది కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారమైన మా ఇంటి ఇలవేల్పుగా కొలిచే శ్రీ ఆంజనేయస్వామి చరిత్రనురాయడం జరిగిందని ఆయన రచించిన ఆంజనేయస్వామి చరిత్ర పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సీతారాంరెడ్డి, జింకలపల్లి భీమేశ్వర్‌రెడ్డి, సంగాల గ్రామానికి చెందిన మల్లారెడ్డి కుమారుడు రాంగోపాల్‌రెడ్డి, హాజరు కాగావారి సమక్షంలో బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో లత్తిపురం రామిరెడ్డి, ఆంజనేయులు సాగర్, మహేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వేమనరిటైర్డ్ హెచ్ఎంశేఖర్‌రెడ్డి, రామాలయం మేనేజర్ సురేందర్‌రాజు, బీచుపల్లి రఘుచౌదరి, వారి కూతుళ్లు, అల్లుళ్లు, వారి బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

## జిఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక



**చిన్నచింతకుంట, జులై 22 ప్రభాతవార్త:** మండలంలోని అమ్మాపూర్, దమగ్నాపూర్ గ్రామాలకు చెందిన పలువురు బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు దమగ్నపూర్ గ్రామంలోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా జిఎంఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా జిఎంఆర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లికొండి సర్పంచ్ కె. వెంకటేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జాకీర్, మండల కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ చంద్రశేఖర్, జయరాజు, బాలరాజు, శేఖర్, అమ్మాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లియొద్దిన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**వీపనగండ్ల, జులై22, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీ పరిధిలో 50వేల మంది సిబ్బంది గత ఏడేళ్లగా తమ ఆరోగ్యాలను లెక్క చేయకుండా గ్రామాలను శుభ్రం చేస్తు ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. గత 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ర్యాలీలు, ధర్నాలు, దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర సీఐటీయు నాయకులు కిల్లె గోపాల్ ప్రభుత్వానికి అడ్డాకుల మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న శిబిరం నుండి అల్టిమేటం జారీ చేశారు. వర్షాకాలం అయినందునపల్లెలన్నీ దుర్గంధంతో కంపుకొడుతున్నాయని అన్నారు. కార్మికులు వీధులగుండా తిరుగుతూ బిక్షాటన చేసి రూ.4305 పోగు చేయడంతో వంటవార్పు నిర్వహించారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, కార్యవర్గ సభ్యులు వెంకటేష్‌గౌడ్, పూర్వజేఏసీకన్వీనర్ భీమన్నయాదవ్ పాల్గొన్నారు.

## డ్రోన్ ప్రదర్శన 28కి వాయిదా..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై22, ప్రభాతవార్త:** దేశంలోనే మొద్దమొదటిసారిగా 449 డ్రోన్‌లతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ పై నేడు(ఆదివారం)నిర్వహించేందకు శ్రీకారం చుట్టిన డ్రోన్ ప్రదర్శన వర్షం కారణంగా వాయిదా పడింది. ఎడతెరపి లేని వర్షం కారణంగా డ్రోన్‌లకు వాతావరణం అనుకూలించకపోవడంతో నేటి ప్రదర్శనను వాయిదా వేసినట్లు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈనెల 28న డ్రోన్‌లతో దేశంలోనే మొదటిసారిగా జిల్లా స్థాయిలో అత్యద్భుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో డ్రోన్ ప్రదర్శన నిర్వహించిన సంగతి తెలిసిందే. అదే తరహాలో కానీ అంతకుమించి అత్యద్భుత ప్రదర్శనలు, డ్రోన్‌లతో విన్యాసాలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి డ్రోన్‌లను తెప్పించినా వర్షం కారణంగా ప్రదర్శన వాయిదా వేసినట్లు తెలిపారు. జూల్28 సాయంత్రం 6గంటలకు ప్రదర్శన యధావిధిగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు , విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున ట్యాంక్ బండ్ వద్దకు చేరకొని ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

## మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయంపై హర్షం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త :** మైనార్టీ ముస్లిం, ఫకీర్ ముస్లి, గరీబ్ ముస్లింలకు ప్రతి ఒక్కరికీ రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు ముస్లిం నాయకులు తెలిపారు. ఈమేరకు సర్కార్ నిర్ణయాన్ని హర్షిస్తూ జడ్చర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటాలకు ముస్లిం మైనార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. హైదరాబాద్‌లోని జలసౌధలో 33జిల్లాల మైనార్టీ సోదరులతో కలిసి మంత్రి హరీశ్‌రావు, హోంమంత్రి మహమూద్ అలీ, బోధన్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ సమావేశం నిర్వహించి బ్యాంక్‌తో సంబంధం లేకుండా రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫకీర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జహంగీర్ పాషా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుని కలిసిన జిల్లా నాయకులు

**నారాయణపేట ప్రతినిధి, జులై22 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో నాయి బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్‌ను కలిసి జిల్లాలో నాయీ బ్రాహ్మణుల సమస్యలపై చర్చించారు. తెలంగాణ ఇస్తున్న లక్ష రూపాయల పథకం అందరికి ఇప్పించాలని దేవాలయ కమిటీలో నాయీబ్రాహ్మణులకు స్థానము కల్పించాలని వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి 5 లక్షల ఉచిత భీమా సౌకర్యం కల్పించాలని 50 ఏళ్ల దాటిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడుఅశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు గోపాల్, రాము, నాయకులు నాగరాజు, యాదగిరి, అశోక్ కుమార్, ఆనంద్‌బాబు, శివప్రసాద్, రవి, సింగారంవెంకటేష్, గంగారాం, రామ కృష్ణ, భాస్కర్, రవి, నర్సింలు, మల్లికార్జున్, సంతోష్ పాల్గొన్నారు.

## కొల్లాపూర్ కోటపై గులాబీ జెండా ఎగరవేస్తాం

**చిన్నంబావి, జులై22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ మాట్లాడుతూ... ఎవరు పార్టీ మారిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొల్లాపూర్ కోటపై మరోసారి గులాబీ జెండా ఎగరవేస్తామని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో చిన్నంబావి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కాదని 19 సంవత్సరాల పాటు చిన్నంబావి మండలాన్ని, సొంత గ్రామాన్ని కానీ ఏనాడు పట్టించుకోనటువంటి వ్యక్తి దగ్గరకు వెళ్లి ఏమీ లాభం లేదని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కేటీఆర్ సలహాలతో కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధికై పరితపిస్తు నిరంతరం కృషి చేస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డిని రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపించి తీరుతామని అన్నారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి చిన్నంబావి మండలంలోని వివిధ పార్టీల నుండి తొందర్లోనే టీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు ఉండబోతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల ఎంపీపీ సోమేశ్వరమ్మ తోపాటుగా మండల పార్టీ అధ్యక్షుడు ఈదన్న యాదవ్ ఉన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని సాధించుకుందాం!

జిల్లా అధ్యక్షులు సనాతన బాలస్వామి

**చిన్నచింతకుంట, జులై 22 ప్రభాతవార్త:** పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు కలిసి రావాలని టిఎస్ సిపిఎస్ఈయు జిల్లా అధ్యక్షులు సనాతన బాలస్వామి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయంలోని ఉద్యోగులతో కలిసి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా టిఎంఇపిఎస్ఇయు జిల్లా అధ్యక్షులు సనాతన బాలస్వామి మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా టిఎస్‌సిపిఎస్ఇయు రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ఈనెల 16న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుండి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ప్రారంభమై రాష్ట్రంలోని 33 జిల్లాలను కలుపుతూ మహబూబ్‌నగర్ జిల్లాలోని జులై 30న ప్రవేశించి యాదాద్రిలో 31న ముగుస్తుందన్నారు. ఈ రథయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిపాత పెన్షన్ సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ సువర్ణరాజ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, సిపిఎస్ ఉద్యోగులు అనిల్‌కుమార్, శశికిరణ్, సంజీవయ్య, శ్రీనివాస్, వెంకట్రాములు, ఆనంద్, చెన్నమ్మ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## అమ్మపల్లిలో నేటి నుంచి మొహరం వేడుకలు

**మాగనూరు, జులై 22 ప్రభాతవార్త:** మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే పండగ మొహరం రానే వచ్చింది. నెలవంక దర్శనం ఇవ్వడంతో మాగనూరు మండలం అమ్మపల్లి గ్రామంలో శనివారం మసీదులో పీర్లను ప్రతిష్టించారు. అన్ని మతాలకతీతంగా పదిరోజులపాటు ఈ ఉత్సవాలను జరుపుకుంటారు. చంద్రవంక దర్శనం ఇవ్వడంతో పాటు ముత్తవలీలు పీర్ల చావిడి ముందు అలై గుంతను తీశారు. రాత్రి వేళల్లో యువకులు అగ్నిగుండం చుట్టు తిరుగుతూ అలయ్ బలయ్‌తో సంబరాలు చేసుకుంటారు. పదిరోజుల పాటు ఉత్సవాలకు అన్నిఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గ్రామ చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సజావుగా సాగిన సర్వసభ్య సమావేశం

**లింగాల, జులై 22 ప్రభాతవార్త:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లింగమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం శనివారం సజావుగా సాగింది. ఈ సమావేశంలో మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపిపి లింగమ్మ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. విద్యార్థులకు సక్రమంగా నాణనయమైన భోజనం, విద్య అందడం లేదని, అధికారులు తగు చర్యలు తీసుకో వాలని కెసిఆర్ తండా సర్పంచ్ మల్లేష్ కోరారు. మండలంలోని అంబట్ పల్లి, లింగాల, చెన్నంపల్లి, రాయవరం, క్యాంప్ రాయవరం గ్రామాల చెక్ డ్యామ్‌లు, వాగులకు సంబంధించి పనులకు ఎస్టిమేషన్ వేసిపై స్థాయి అధి కారులకు పంపించడం జరిగిందని ఇరిగేషన్ ఏఈ సందీప్ తెలిపారు. కార్య క్రమంలో ఎంపిడిఓ గీతాంజలి, తహసిల్దార్ మునీరుద్దీన్, ఇరిగేషన్ డీఈ ప్రియాంక, వైస్ఎంపిపి నారాయణగౌడ్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లింగమ్మ